నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

గొర్రెలు దొంగలించిన నలుగురి రిమాండ్

తాండూర్ : గొర్రెలను అపహరించిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..నారాయణపేట జిల్లాకు చెందిన పొర్ల నరేష్ జనవరి నెలలో వృత్తిలో భాగంగా గొర్లను మేపడానికి కన్నెపల్లి మండలంలోని జనకాపూర్ గ్రామానికి వచ్చాడు. చుట్టుపక్కల గల పత్తి చేనులలో గొర్లను మేపుతుండగా 33 గొర్రెలు చోరీకి గురయ్యాయి. దీంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా జనకాపూర్ గ్రామానికి చెందిన అల్లి ప్రశాంత్, ముసుకుల సంతోష్, అనంతుల అభిలాష్, వనపర్తి సత్తన్న బొలెరో వాహనంలో గొర్రెలను తరలిస్తుండగా కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద పట్టుకున్నారు. నిందితులు తాము గొర్రెలను దొంగతనం చేశామని నేరం ఒప్పుకున్నారు. వారిని అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరు పరిచారు.



ఆఫ్‌లైన్‌లోనూ పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

నవతెలంగాణ-జైపూర్

జిల్లాలో పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో కలిశారు. ఆన్‌లైన్ సర్వర్ డౌన్ అవుతున్న సందర్భంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వెల్లడించిన నాయకులు ఆన్‌లైన్ పని చేయనప్పుడు ఆఫ్‌లైన్‌లో పత్తి కొనుగోలు చేపట్టాలని కోరారు. రైతుకు సంబంధించిన ఆధార్‌కార్డు ఆధారంగా మ్యానువల్ పద్ధతితో పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ సర్వర్ డౌన్ కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో వారం పది రోజులు వేచి చూడాల్సి వస్తుండటంతో పత్తిని తరలించేందుకు వినియోగించుకున్న వాహనాల వెయిటింగ్ చార్జీలు అత్యధికంగా చెల్లించాల్సిన పరిస్థితులను వివరించారు. స్పందించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర టెక్స్‌టైల్ మంత్రితో పాటు సీసీఐ సీఎండీతో మాట్లాడి పత్తి రైతుల సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం అంతా అబద్ధం..!

- ప్లాట్లు అమ్ముకునేందుకు చేస్తున్న ప్రచారం మాత్రమే
- ఇస్కాన్ సంస్థ ప్రతినిదుల ఫిర్యాదుతో తేటతెల్లం

భీమారం మండల కేంద్రంలో సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ ఏర్పాటు చేసిన జై శ్రీశ్రీ కృష్ణ బలరామ్ టౌన్ షిప్ వ్యవహారం చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లుంది. డీటీసీపీ అనుమతితో టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఈ టౌన్ షిప్‌లో ఇస్కాన్ టెంపుల్ నిర్మిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన ప్రముఖ అధ్యాత్మిక సంస్థ(ఇస్కాన్) ప్రతినిదులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అంతే కాకుండా ఇస్కాన్ సంస్థ టెంపుల్ నిర్మిస్తుందని చేసిన ప్రచారం నమ్మి ప్లాంట్లు కొని మోసపోవద్దని ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. అదేవిధంగా భీమారం జై శ్రీశ్రీ కృష్ణ బలరామ్ టౌన్‌షిప్‌లో ఇస్కాన్ సంస్థ ఎలాంటి టెంపుల్ నిర్మించదని సంస్థ ప్రతినిదులు స్పష్టం చేశారు.

నవతెలంగాణ-జైపూర్


నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి నెం.63కు అతి సమీపంలో గల జస్టిస్ జగన్‌మోహన్‌రెడ్డి మామిడి తోటను కొనుగోలు చేసిన సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ జై శ్రీశ్రీకృష్ణ బలరామ్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తోంది. 84.16 ఎకరాల్లో డీటీసీపీ అనుమతితో వెంచర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారు ఈ టౌన్ షిప్‌లో హరే కృష్ణ సంకీర్తన మూమెంట్ వారి ప్రముఖ ఇస్కాన్ టెంపుల్ నిర్మించున్నట్లు ప్రచారం చేస్తుండటం చర్చానీయాంశమైంది. టౌన్‌షిప్ మొత్తం విస్తీర్ణంలో 959 ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించిన సిస్కో ఇన్‌ఫ్రా డెలపర్స్ కొనుగోలుదారులను ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలో ప్రతి గజం రేటు రూ.6,499 ధరతో విక్రయించాలని నిర్ణయించుకున్నా ముందస్తుగా రూ.5,499తో అడ్వాన్సుతో ప్లాట్ బుక్ చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కొనుగోలుదారుల్లో ఆసక్తిని పెంచడం కోసం రకరకాలైన ప్రత్యేకతలతో జై శ్రీశ్రీ కృష్ణబలరామ్ టౌన్‌షిప్ రూపుదిద్దుకుంటుందని పేర్కొంటున్నారు. ప్రధానంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ ఇస్కాన్ సంస్థ హరే క్రిష్ణ సంకీర్తన మందిరం నిర్మిస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. కాగా జై శ్రీశ్రీ కృష్ణ బలరామ్ టౌన్‌షిప్‌లో హరే క్రిష్ణ సంకీర్తన మూమెంట్ నిర్మించనున్న ఇస్కాన్ టెంపుల్ కోసం 5ఎకరాల స్థలం కేటాయించినట్లు పేర్కొంటూ ప్లాట్ల విక్రయానికి శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా ఈ టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొనుక్కున్న ప్రతి కుటుంబానికి ఇస్కాన్ లైఫ్ టైమ్ కార్డు ఇవ్వబడుతుందని, ఈ కార్డు ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇస్కాన్ టెంపుల్స్‌లో వీఐపీ దర్శనం, ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుందని కొనుగోలుదారులను ప్రేరేపిస్తున్నారు. ఈ టౌన్‌షిప్‌కు అతి దగ్గరలో గౌరంగ, బలరామకృష్ణ, రాధాకృష్ణ, లక్ష్మినరసింహస్వామి, బాలాజీ మందిరం నిర్మిస్తామని సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రతినిధులు వెల్లడిస్తున్నారు.



టౌన్‌షిప్‌లో నిర్మాణం కానునున్నట్లు ప్రచారం చేస్తున్న ఇస్కాన్ టెంపుల్ ఊహ చిత్రం

జై శ్రీశ్రీ కృష్ణబలరామ్ టౌన్‌షిప్‌లో అభివృద్ధి పనులు మొదలు

భీమారం మండల కేంద్రంలో సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఏర్పాటు చేయతలపెట్టిన జై శ్రీశ్రీ కృష్ణబలరామ్ టౌన్ షిప్‌లో ప్లాటింగ్ మొదలైంది. సుమారుగా వందేండ్లు, వంద ఎకరాల్లో జస్టిస్ జగన్‌మోహన్‌రెడ్డి(జడ్జిదొర) మామిడి తోటగా గుర్తింపు పొందిన పచ్చని మామిడి తోట ఇప్పుడు టౌన్‌షిప్‌గా మారబోతోంది. వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న మామిడి తోటలో 15 నుండి 20 ఎకరాలు అసైన్డ్ భూమి ఉందని తెలుస్తుండగా మిగతా 86.14 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ జై శ్రీశ్రీ కృష్ణబలరామ్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అవసరాల మేరకు మామిడి చెట్లు తొలగిస్తూ రోడ్లు వేస్తూ ప్లాట్లు విభజిస్తున్నారు. 33, 60 ఫీట్ల బ్లాక్ టాప్ రోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొంటున్నారు. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం అతి తక్కువగా 130 స్క్వేర్ యాడ్స్ నుండి 609 స్క్వేర్ యాడ్స్‌తో 959 ప్లాట్లు ఏర్పాటు చేసేందుకు డీటీసీపీ అనుమతి పొందినట్లు వెల్లడిస్తున్నారు. కాగా డీటీసీపీ అనుమతి పొందకుండా వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలియవచ్చింది.



టౌన్‌షిప్‌లో ప్లాట్ల నిర్మాణం


ప్లాటింగ్ కోసం చదును చేసిన మామిడి తోట

ఇస్కాన్ సంస్థ ఫిర్యాదుతో దర్యాప్తు కొనసాగుతోంది : జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం మండల కేంద్రంలో జై శ్రీశ్రీ కృష్ణ బలరామ్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారిపై ఇస్కాన్ సంస్థ ప్రతినిదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నాం. జైశ్రీశ్రీ కృష్ణబలరామ్ టౌన్‌షిప్‌లో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం అబద్ధపు ప్రచారమని చెబుతుండగా వెంచర్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వపరమైన అనుమతులు తదితర విషయాలపై దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి స్థాయి సమాచారం లేకుండా టౌన్‌షిప్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెంటనే మంజూరు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ కార్పొరేషన్ నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.నర్సింగ్ అన్నారు. బుధవారం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, మహనీయుల జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని కోరారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎస్సీలో ఉన్న కులాల వారు తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ సంక్షేమ సంఘాన్ని వేదికగా చేసుకొని పోరాడాలని పేర్కొన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడం కోసం గ్రామాల్లో మండలాల్లో కమిటీలను వేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు తలారి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నిధులను మంజూరు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, బ్యాంకు ద్వారా ఇచ్చే లోన్‌కు ఎలాంటి షరతులు లేకుండా లోన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా చెవుల వాసు, ఉపాధ్యక్షునిగా పుట్ట రవి, ప్రధాన కార్యదర్శిగా పర్లపెల్లి సారయ్య, ప్రచార కార్యదర్శిగా తరాల విజయ్, గౌరవ సలహాదారునిగా తరాల లక్ష్మినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శీలం రంజిత్ కుమార్, నాయకులు తారల శ్రీహరి, చీమల రాజలింగు,సోగాల రాములు, సొల్లు కొమురయ్య, ఎం.సామ్యూల్ పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-మందమర్రి

కేకే -5 గనిలో గని మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో గైర్హాజరు కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరు కార్మికులు విధులకు హాజరు కావాలని నాగాల పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దని గని మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయన్నారు. కార్మికులకు విధుల వద్ద ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఇతరులకు చెప్పడం వల్ల పరిష్కారానికి మార్గం దొరుకుతుందన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుండి గైర్హాజరుకు సంబంధించి సర్క్యులర్ వచ్చిందని తెలిపారు. భూగర్భ కార్మికులు ప్రతినెల 16 మస్టర్లు, ఉపరితల కార్మికులు 20 మస్టర్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గైర్హాజరు కార్మికులకు ప్రతినెల కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. విధులకు తరుచుగా గైర్హాజరైతే మస్టర్లు లేక డిస్మిస్ అయ్యే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. డిస్మిస్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని, దీన్ని అర్థం చేసుకోవాలని అన్నారు. అనారోగ్యంతో పాటు ప్రమాదాల బారిన పడి గాయాలు మాని ఒళ్లు నొప్పులు ఉన్నటువంటి కార్మికులు వారి పరిస్థితిని పైఅధికారుల దృష్టికి తీసుకెళితే కొద్ది రోజులు సర్ఫేస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. పని లేకుండా విధులకు గైర్హాజరవుతూ వారి కుటుంబాలకు ఇటు సింగరేణి సంస్థకు భారం కావద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రక్షణాధికారి రమేష్, సంక్షేమ అధికారిని ఆకుల రవళి, ఆఫీస్ సూపరింటెండెంట్ బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆకాశవాణి కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, శ్రోతలకు నాణ్యమైన ప్రసారాలను అందిస్తున్న ఆకాశవాణి ఆదిలాబాద్ సిబ్బంది కృషి అభినందనీయమని ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంజనీరింగ్ బానోత్ హరిసింగ్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి రాబోయే రోజుల్లో ఈ కేంద్రం పేరును నిలపాలని అన్నారు. సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రంలోని ట్రాన్స్ మీటర్, 100 మీటర్ల టవర్, స్టూడియో, ట్రాన్స్ మిషన్ బూత్, డిజి రూం తదితర విభాగాలను పరిశీలించారు. ట్రాన్స్ మిషన్ పనితీరును, డిజటలైజ్డ్ కన్సోల్స్ పనితీరును ఇక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యక్రమ, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశమై పలు విషయాలను చర్చించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులకు మంచి పేరు ఉందని, అలాగే ఈ కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత కార్యక్రమ, ఇంజనీరింగ్ సిబ్బంది పరస్పర సహకారంతో శ్రోతలకు మరింత నాణ్యమైన ప్రసారాలను వినిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలోని పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆకాశవాణి అసిస్టెంట్ డైరెక్టర్ ఇంజనీరింగ్ లక్కోజు శ్రీనివాస్, కేంద్రం ముఖ్యకార్యక్రమ అధికారి రామేశ్వర్ కేంద్రే, ట్రెక్స్ వెంకటేశులు, ఇంజరింగ్ సిబ్బంది పోతురాజు, శశికాంత్, గిరీష్‌కుమార్, వెంకటయ్య, విజయకుమారి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) నిరసనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆదిలాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వివిధ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదిలాబాద్, మావల, సాత్నాల, బోరజ్, జైనథ్, బేల మండలాల తహసీల్దార్ కార్యాలయాల ముందు నిరసన తెలిపి ఆయా తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. బోరజ్ తహసీల్దార్ కార్యాలయం ముందు పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు తీరని నష్టం, ధనికులకు మేలు చేసే విధంగా ఉందన్నారు. పేదలకు, కార్మికులకు, పేద రైతులకు అనుకూల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో పార్లమెంట్‌లో ఫైనాన్స్ బిల్లును ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోని 200 మంది శతకోటీశ్వరులపై 4శాతం సంపద పన్ను వేయాలని, కార్పొరేట్ పన్ను పెంచాలని, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 50శాతం నిధులు పెంచాలని, దీన్ని పట్టణాలకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య, విద్యా రంగాలకు జీడీపీలో 3శాతం చొప్పున కేటాయింపులు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆహార సబ్సిడీ పెంచాలని, దళితులు, గిరిజనులు, మహిళా, శిశు సంక్షేమానికి నిధులు పెంచాలని, స్కీం వర్కర్ల గౌరవ వేతనంతో కేంద్ర వాటా పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేయడం ఆపాలని, బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు ఎ.కిష్టన్న, ఎం.గంగన్న, కె.ఆశన్న, వెంకన్న తానుష్, పొచ్చక్క, గంగారాం, రవి, బాపు, అరవింద్ పాల్గొన్నారు.


బోరజ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అంజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు


మావల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి : జిల్లా న్యాయమూర్తి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్ కోరారు. బుధవారం జిల్లా కోర్టులోని ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మార్చి 8న నిర్వహించే లోక్ అదాలత్ వివరాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి వెల్లడించారు. పెండింగ్ కేసుల్లో రాజీపడదగ్గ కేసులను పరిష్కరించేలా లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్చి 8న జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదాలత్ కొనసాగుతుందన్నారు. సమస్యల నుండి శాశ్వతంగా ఉపశమనం పొందాలని సూచించారు. సత్వర కేసుల పరిష్కారంతో సమయం ఆదా కావడంతో పాటు మానసికంగానూ కొంతవరకు ఒత్తిడి తగ్గుతుందని తెలియజేశారు. లోక్ అదాలత్‌లో అన్నిరకాల సివిల్, వైవాహిక, బ్యాంకు, ఇన్సూరెన్స్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా న్యాయవ్యవస్థ అందించిన ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

సమీకృత గురుకులాల స్థల సేకరణ వేగవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమీకృత గురుకుల పాఠశాలల(యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) స్థల సేకరణ వేగవంతం చేయాలని సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణా ఆదిత్య అన్నారు. బుధవారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకురావడం కోసం ప్రయోగాత్మకమైన అడుగులు వేయడం జరుగుతుందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సమీకృత గురుకుల పాఠశాలకు అవసరమైన స్థలాల సేకరణ వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహ సముదాయం కోసం ఆదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్‌లో స్థలాన్ని కలెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. 20 ఎకరాల స్థలం సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని, నిషాన్‌ఘాట్‌లో 38వ సర్వే నెంబర్‌లో 20ఎకరాల భూమిని సోషల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ వింగ్‌కు నిర్దేశిత గడువులోగా పనులు ప్రారంభించేల ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. అంతకు ముందు కలెక్టర్ ఛాంబర్‌లో కమిషనర్ మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ విద్యపై సమీక్షిస్తూ సీసీ కెమెరాస్ గురించి, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ సజావుగా జరపాలని అన్నారు. థియరీ ఎగ్జామ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ సి.రవీందర్‌కుమార్‌ను ఆదేశించారు. ఏజీఎంసీ జిల్లా అధికారులతో కళాశాలలో హాజరు శాతం, స్లిప్ టెస్టులు, అడ్మిషన్ డ్రైవ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రెవెన్యు డివిజనల్ అధికారి వినోద్ కుమార్, ఉమ్మడి జిల్లా ఇంజనీరింగ్ వింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ పి.సతీష్ కుమార్ తెలిపారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | ఫిబ్రవరి 20, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఈ నెల 27న జరుగే శాసన మండలి ఎన్నికలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి వై.అశోక్ కుమార్‌ను మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఆ సంఘం నాయకులు ఆత్రం భుజంగ్ రావ్, లక్ష్మణ్ రావ్, ఏజస్వామి, కే.గణేష్ కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన అభ్యర్థని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కార్పొరేట్ సంస్థల యజమానులకు ఓటు వేస్తే నిష్ప్రయోజనమని వారికి ప్రభుత్వ విద్యారంగంపై ఎటువంటి చిత్తశుద్ధి ఉండదని, ధనార్జనే ధ్యేయంగా వారు పని చేస్తారన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలో మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయుడు దేవరాజు ఇటీవల పాఠశాలలోని గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు, పోషకులతో పాటు రాష్ట్రంలో ఉన్న మోడల్ స్కూల్ సిబ్బంది, బోథ్ మండల టీచర్లు సేకరించిన రూ.1,51,121 నగదు ఆర్థిక సాయంగా కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



నిర్మల్ టౌన్ : శివాజీ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శివాజీ చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడి, 17 సంవత్సరాల పిన్న వయసులోనే మొఘల్ సామ్రాజ్యంను గడగడలాడించిన శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలనీ సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, మాజీ కౌన్సిలర్లు చిన్నయ్య, బీట్లింగ్ నవీన్, సాదం అరవింద్, నరేందర్, శంకర్ పతి పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ 359వ జయంతిని మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొనిజెండా ఆవిష్కరణ చేసి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. దేశ చరిత్రలోనే గొప్ప వీరుడని కొనియాడారు. కుల మత బేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో నేటి యువత నడుచుకోవాలన్నారు. త్వరలోనే శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

సారంగాపూర్ : మండలం కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్ర ప్రకాష్ గౌడ్, సామల వీరయ్య, దోకూర్ భీమలింగం, కె.మహేష్ రెడ్డి, హిందూ వాహిని సభ్యులు సత్యం, దొడ మహేష్, బింగి రంజిత్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు శంకర్‌గూడ, ధనోర-బి తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ధనోర-బిలో టైగర్ గ్రూప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలోనూ జయంతి నిర్వహించారు.

నేరడిగొండ : మండలంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏకల్ అభియాన్ అంచల్ కార్యాలయ ప్రముఖ్ ఉడుగుల అభిలాష్ మండలంలోని లఖంపూర్ శ్రీశ్రీశ్రీ చైతన్య రామగిరి మహారాజ్ ఆశ్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాదవ్ శివాజీ, డోంగరి రమేష్, టేకం భీంరావ్, బి.వెంకటమ్మ, నర్సయ్య పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, బొరిగాం, చించాల తదితర గ్రామాలలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిత్రపతి శివాజీ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అలాగే ముథోల్‌లో ఆరె మరాఠీ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. రభింద్ర ఉన్నత పాఠశాల, అక్షర, శిశుమందీర్ పాఠశాలలో జయంతి జరిపారు. సీఐ మల్లేష్, ఎస్ఐ సంజీవ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

నార్నూర్ : సామ్రాట్ వీర్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రోజు జాతీయ సెలువు దినంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షులు భిక్కు రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో నాయకులు చాఉర్కర్ ప్రకాష్, జ్ఞానోబా పుష్కర్, జాదవ్ రాహుల్, జాదవ్ మాహేందర్, సావన్, ధర్మరక్షక్, శ్రీకాంత్, కపిల్, శివాజీ ఉన్నారు.

ఆదిలాబాద్ టౌన్ : ఛత్రపతి శివాజీ మహారాజ్ యుగపురుషుడని అందరి సంక్షేమమం కోసం పాటుపడ్డారని ఆరే మారఠ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోన్సలే దశరత్ పటేల్ అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శివాజీ చౌక్ లోని ఆయన విగ్రహానికి ఉదయం పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి విగ్రహానికి పూలమాలలేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేద్రోణలే, కోశాధికారి రాజు షిండే, తనాజీ నిక్కం, పట్టణ అధ్యక్షుడు గోవింద్ రావ్, , స్నేహల్, ఆనంద్ రావ్, అవినాశ్, యోగేష్ పాల్గొన్నారు.

సనాతన సమితి ఆధ్వర్యంలో...

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్ లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు రేనికుంట్ల రవీందర్, ఉరడే సుభాష్, కందుల రవీందర్, మర్శెట్టి రాజు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్ లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సనాతన ధర్మరక్షణలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, వేదావ్యాస్, నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బుధవారం పట్టణంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కో కన్వీనర్ నిఖిల్, హాస్టల్ కన్వీనర్ మహేష్, ఉదయ్, అరుణ్, కార్తీక్, సిద్దు, సాయినాథ్, మనీష్ ఉన్నారు.

భీం ఆర్మీ అజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

భీం ఆర్మీ అజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల శివాజీ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పంచశిల్, వాటోరే రంగారావు, షేక్ జవీద్, షేక్ ఆసిఫ్, అనిల్ సావుడే, సూరజ్, రాహుల్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



సారంగాపూర్



నార్నూర్

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

వందశాతం పన్నులు వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో వివిధ కాలనీలలో జరుగుతున్న పన్నుల వసూలు, వాణిజ్య లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి పన్నుతో సహా అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వాణిజ్య లైసెన్సులను పునరుద్ధరించుకోవాలన్నారు. సకాలంలో పన్నులను చెల్లించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దివ్యగార్డెన్ సమీపంలోని అర్బన్ పార్కును పరిశీలించి పార్కు అభివృద్ధికి సూచనలు చేశారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా పార్కును తీర్చిదిద్దాలన్నారు. పార్కు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈ హరి భువన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ద్వారా రికవరైన కంప్యూటర్లు



నవతెలంగాణ- ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో చోరికి గురైన కంప్యూటర్లను ఖానాపూర్ ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ పాఠశాలకు అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు గురువారం పాఠశాలకు పోలీస్‌లు అందించారు. గత నెలలో సంక్రాంతి సెలవుల్లో 3 కంప్యూటర్లు దొంగలు ఎత్తుకెళ్లారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే 3 రోజుల అనంతరం దొంగలు సుర్జాపూర్ పొలాల్లో పడేసి వెళ్ళిపోయారు. పోలీసులు దొరికిన 2 మానిటర్లు, 3 సీపీయూ, 2 యూపీఎస్, 3 కీ బోర్డు, 3 మౌస్‌లు కోర్టుకు అప్పగించారు. అడ్వకేట్ బాశెట్టి శివకుమార్ కేసు పూర్వాపరాలను వివరించారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. వీడీసీ అధ్యక్షులు అడ్వాల శంకర్, ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ కోర్టుకు హాజరై కంప్యూటర్లను తీసుకున్నారు.

ఆరోగ్యం కోసం నిత్యం యోగా చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మానసిక, శరీరక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు నిత్యం యోగా చేయాలని యోగా గురువు సంజయ్ బాశెట్టివార్ అన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో మహిళలకు ప్రత్యేకంగా అందిస్తున్న యోగా శిక్షణకు 19 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. బుధవారం ఇక్కడ యోగశిక్షణ పొంది వారివారి ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్న గురువులకు సన్మానించారు. అంతకు ముందు యోగాసానాలు వేసి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవన శైలిలో ఒత్తిడి పెరిగి మానసిక ప్రశాతంత లభించడం లేదన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. 19 ఏండ్లుగా ఆఫీసర్ క్లబ్‌లో ప్రత్యేకంగా మహిళాల కోసం యోగా శిక్షణ ఇస్తున్నామన్నారు. 2006లో ప్రారంభించిన సమయంలో ఐదుగురు మాత్రమే ఉండేవారన్నారు. కానీ ఇప్పుడు ఆ సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యోగాగురువులు విఠల్ రెడ్డి, నాగేశ్వర రావ్, శిక్షకులు పాల్గొన్నారు.

పేదలకు కరెంట్ సౌకర్యం కల్పించాలి

- విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, పేదలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్ ఘాట్‌లో గుడిసేలు వేసుకోని నివాసం ఉంటున్న పేదలకు కరెంట్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేవారు. బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఏండ్ల నుంచి నివాసం ఉంటున్న కనీస సౌకర్యం అయిన కరెంట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషాన్‌ఘాట్‌లో ఏండ్లుగా నివాసం ఉంటున్న పేదలకు కరెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. రాత్రి సమయంలో విష కిటకిటల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్న వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు నిషాన్ ఘాట్ నివాసం ఉంటున్న వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేల చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలక దేవిదాస్, మేస్రం భాస్కర్, కట్ట క్రిష్ణస్వామి, చట్ట చంద్రమౌళి, కట్ట కిష్టయ్య, గేడం కేశవ్, పొచ్చిరావ్, సంగీత, శబన, రేఖ పాల్గొన్నారు.

కళాశాలలో మార్కెటింగ్ కోర్సు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం సోషల్ మీడియా మార్కెటింగ్ అనే అంశంపై 30 రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు గణపతి అధ్యక్షత వహించి కోర్సు ప్రాముఖ్యతను అవకాశాలను విద్యార్థలకు తెలియజేశారు. కోర్సు కోఆర్డినేటర్ కే.చంద్రకాంత్ కోర్సు ఉద్దేశాలను, వివరాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సౌజన్య, కార్తీక్, కృనాల్, గజానంద్, బీకాం విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-కుభీర్

గ్రామపంచాయతీలో పెండింగ్ బిల్లులకు సంబంధించి నిధులను విడుదల చేయాలనీ పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం మండల అధికారి నవనీత్ కుమార్‌ను మండల పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ఫిబ్రవరిలో పాలకవర్గ కాలపరమితి ముగియాడంతో రోజువారీ నిర్వహణ పారిశుధ్య పనులకు కావాల్సిన ట్రాక్టర్ డీజిల్, నిర్వహణ తదితర పనుల గురించి డబ్బులు ఖర్చు చేశామన్నారు. దానికి సంబంధించిన నిధులను విడుదల చేయాలని కోరారు. రానున్న వేసవి కాలంలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుందని, పెండింగ్ బిల్లులను విడుదల చేస్తేనే సమస్యలు పరిష్కరించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ జడ్పీటీసీ పతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, దేవరకోట ఆలయ కమిటీ చైర్మన్ కొండా శ్రీనివాస్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ గంగోని భూరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, అప్పాల గణేష్, ఎర్రవోతూ రాజేందర్, సమర సింహ రెడ్డి, నందెడపు చిన్ను, ఎంబడి రాకేష్, ఎంబడి రాజేశ్వర్, అయిర నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మోటివేషన్ తరగతులు కొనసాగింపు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ఆర్టీసీ ఎండి.సజ్జనార్ ఆదేశానుసారం ఆర్టీసీ ఉద్యోగులకు రెండవ రోజు మోటివేషన్ తరగతులను రీజినల్ మేనేజర్ సోలమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పనిని తన పనిగా భావించి చేయాలన్నారు. ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ఉంటుందని, అందరు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. సంస్థ ఉంటేనే సిబ్బంది ఉంటారని, సమిష్టిగా కృషి చేసి సంస్థ మనుగడకు పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, ఏఈ(ఎం)నవీన్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విగ్రహా ఏర్పాటుకు దాతలు సహకరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రవీంద్రనగర్ అయ్యప్ప ఆలయంలో పంచలోహ విగ్రహా ఏర్పాటుకు దాతలు, భక్తులు సహకారం అందించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు వేణుగోపాల్ కోరారు. బుధవారం ఆలయంలో పూజలు చేసి విగ్రహా ఏర్పాటు, దాతలు అందిస్తున్న సహకారం గురించి తెలియజేశారు. ఆలయంలో భక్తుల కోరిక మేరకు పంచలోహా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు మూడు తులల బంగారం తొమ్మిది మంది భక్తుల నుంచి సమకురిందన్నారు. మరింత మంది భక్తులు ముందుకు వచ్చి సహకారం అందించి మహాత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పూజారి దామోదర్ గురుస్వామి, బండి అశోక్, కాపుర్కర్, ఉషారెడ్డి ఉన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-కడెం

బీజేపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య గెలుపు ఖాయమైందని ఆ గెలుపులో ప్రతి టీచర్ భాగస్వామ్యం ఉండాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, వెంకటేష్, ఉపేందర్, మనోజ్, రవీందర్, అనిల్ రావు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య భవనంలో బుధవారం పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు బూర ఉమా శంకర్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ వెల్దండి అశోక్ కుమార్ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల అందజేత

నవతెలంగాణ-బేల

మండలంలోని కరోని(బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులకు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ప్లేట్లను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయి కుమార్, ఉపాధ్యాయుడు రవీందర్, నాయకులు స్వప్నిల్, రాజు, ఈశ్వర్, గ్రామస్తులు గోద్రు పటేల్, ఈస్రు, తోడసం గోవింద్ రావు, ఆత్రం పైకు, సురేష్ ఉన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నవతెలంగాణ-దహెగాం



మండలంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగి రాజ్ కుమార్‌పై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల యూనియన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం దాడి విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్దు రోజా, వీఓఏలు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిండి..దుర్గంధం వెదజల్లి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని రామ్ టాకీస్ ఎదుట డ్రైనేజీ నిండిపోవడంతో దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండే ప్రాంతం అయిన మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో దుర్గందం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి డ్రైనేజీ శుభ్రం చేసి తమ కష్టాలు తీర్చాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాగజ్‌నగర్ డివిజన్ షీటీం ఇన్‌చార్జి రమాదేవి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని మహాత్మ జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌ల గురించి తెలియజేశారు. షీటీం పని చేసే విదానాన్ని వివరిస్తు సామాజిక మధ్యమాలు వాడే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. సైబర్ క్రైం 1930కు డయల్ చేయాలని, అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం కాగాజ్‌నగర్ ఫోన్ నంబర్ 8712670565కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భారతి, సిబ్బంది షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి నిజ ధ్రువీకరణ పత్రాలు మరిచిపోయిన బాధితునికి డిపో మేనేజర్ విశ్వనాథ్ కండక్టర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిర్యాణికి చెందిన ప్రయాణికుడు ఆసిఫాబాద్ నుండి తాండూర్‌కు ప్రయాణం చేసి అతని భార్యకు సంబంధించిన ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను బస్సులో మర్చిపోయాడు. కండక్టర్ మనెమ్మ గుర్తించి డిపోలో అందజేశారు. బాధితులకి సమాచారం అందించి వాటిని అందజేశామన్నారు. ఈ సందర్భంగా బాధితులు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డిపో మేనేజర్ కండక్టర్, డ్రైవర్‌ను అభినందించారు.

23న టీజీ సెట్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-రెబ్బెన

5 నుండి 9వ తరగతి వరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలలో ప్రవేశానికి అర్హత పరీక్ష ఈనెల 23న నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ గురుకుల సంక్షేమ పాఠశాల, కళాశాల(బాలికల) ప్రిన్సిపాల్ ఆత్రం చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. రెబ్బెన గురుకుల పాఠశాల కేంద్రంలో పరీక్షలు రాసే విద్యార్థులు తమతమ హాల్ టికెట్లతో పాటు ఆధార్ కార్డు విధిగా తీసుకురావాలన్నారు. ఓఎంఆర్ షీట్ విధానంలో బబ్లింగ్ చేయడం ఉంటుందని బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ ఉపయోగించాలన్నారు. పరీక్షా సమయం ఉదయం 11:00 నుండి ఒంటిగంట వరకు ఉందని, ఉదయం 10 గంటలకు కేంద్రంలో అనుమతిస్తామన్నారు. విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

2024-25 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో విద్యార్థిని ఎంపికైంది. మండలంలోని చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సొతుకు ఆశ్రిత ప్రతిభ కనపరిచిందని ఇన్‌చార్జి హెచ్ఎం కుసుమ సుధాకర్ తెలిపారు. ఈ విద్యార్థినికి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు ఉన్నత చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నారు. ఈ సందర్భగా విద్యార్థిని ఆయనతో పాటు ఉపాధ్యాయులు గులాబ్ రావు, మోహన్, సంతోషి రేఖ, విద్యార్థులు అభినందించారు.

మీ ఆడబిడ్డగా ఆశీర్వదించండి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అవకాశం ఇవ్వాలని మెతుకు హేమలత పటేల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ పాలన ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే నాయకులను ఎన్నుకోవాలన్నారు. పట్టభద్రుల హక్కులను కాపాడేందుకు, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి, నిరుద్యోగ యువతకు అవకాశాలు పెంచేందుకు చట్టసభలో పోరాడుతానని తెలిపారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు.



టిమ్ డ్రైవర్లకు డీఎంకు వైరం

- ప్రయివేట్ వ్యక్తులతో టిమ్ టికెట్లు జారీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని డిపోలో టిమ్ డ్రైవర్లు, డిపో మేనేజర్‌కు మధ్య నిరంతర వైరం కొనసాగుతూనే ఉంది. మూడు మస్టర్లు ఇవ్వాలంటూ టిమ్ డ్రైవర్లు డిమాండ్ చేస్తుండగా వీలు కాదని డిఎం విశ్వనాథ్ చెబుతున్నాడు. వారం క్రితం టిమ్ డ్రైవర్లు నిరసన తెలపడంతో పాటు రీజనల్ మేనేజర్ వరకు కూడా సమస్య వెళ్లిన విషయం తెలిసిందే. అయిననా సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో కొన్ని రోజులుగా వారి మధ్య వైరం పెరుగుతూనే ఉంది. తాజాగా టిమ్ బస్సులలో డ్రైవర్లు కాకుండా ప్రయివేట్ వ్యక్తులతో టికెట్లు తీస్తుండడంతో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తమ పరిస్థితి అధ్వానంగా తయారైందని, డిపో మేనేజర్ విశ్వనాథ్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇంకా ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నాడని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ డ్రైవర్ల పరిస్థితి అర్థం చేసుకొని గతంలో లాగా హైదరాబాద్ డ్యూటీకి మూడు మస్టర్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ప్రయివేట్ వ్యక్తులు టికెట్లు జారీ చేయడంతో ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని, అదే సందర్భంలో హైదరాబాద్ వరకు ఐదు చోట్ల మాత్రమే టికెట్లు జారీ చేసే విధానాన్ని ఏర్పాటు చేయడంతో మధ్యలో ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలని చూస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు పరిస్థితి అర్థం చేసుకొని తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కెరమెరి

నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని ఇతరుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని వివిధ గ్రామాల నుండి మహారాష్ట్రకు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన విజయ్ కుమార్ బొలెరో పికప్ వాహనం తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలిస్టేషన్‌కు తరలించారు. ఒకరిపై కేసి నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. ఎవరైన బియ్యం అక్రంగా రవాణ చేసిన నిల్వ ఉంచిన వారి వివరాలను తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుళ్ల రమేష్, సంజీవ్, దేవేందర్ పాల్గొన్నారు.



పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-వాంకిడి

ఎండకాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ వి.ప్రవీణ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యలు లేకుండా గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. నర్సరీల్లో పూర్తిస్థాయిలో జర్మినేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, షేడ్‌నెట్ ఏర్పాటుచేయాలని, విత్తనాలు మొలకెత్తని చోట కొత్త విత్తనాలు వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గాయని, ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని సూచించారు. పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ, ఏఈఆర్ఎస్‌డబ్ల్యూ, ఏపీఓ, ఈసీ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ఫలితంగా కనీస వేతనాలు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి వ్యాప్తంగా నర్సరీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం కనీస వేతనాలను జీఓ ప్రకారం చెల్లించేలా చర్యలు తీసుకుంటుందని ఐక్య పోఆరటల ఫలితంగా కనీసన వేతనాలు అమలవుతున్నఆయని కార్మికులు అన్నారు. 8.33 బోనస్ అమలు, సీఎం పీఎఫ్ సౌకర్యం, హస్పటల్ సౌకర్యం, బ్యాంకు జీతాలు మార్చి ఒకటో తేదీ నుండి అమలుకు సర్క్యులర్ విడుదల చేయడంతో కార్మికులు ధన్యవాదలు తెలిపారు. బుధవారం కొత్తగూడెం సింగరేణి నర్సరీలో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించగా సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బెల్లంపల్లి డివిజన్ బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి కొయ్యడ సాగర్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సింగరేణి వ్యాప్తంగా నర్సరీలలో కాంట్రాక్ట్ కార్మికులకు సరైన సౌకర్యాలు, వేతనాలు లేకుండా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. 2022లో జేఏసీగా 18 రోజులు సమ్మె చేసి చట్టబద్ధమైన ఒప్పందం చేసుకున్న ఫలితంగా నేడు సింగరేణి యాజమాన్యం నర్సరీ కార్మికులకు మార్చి ఒకటో తేదీ నుండి జీఓ ప్రకారం కనీస వేతనాలు చెల్లించేందుకు సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. సింగరేణి డైరెక్టర్స్, సింగరేణి ఫారెస్ట్ అధికారులకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘంతో ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణాలను పరిశీలించిన డీఈఈ



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను ఆసిఫాబాద్ గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.వేణుగోపాల్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ రూ. ఐదు లక్షలతో నిర్మిస్తున్న పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బెజ్జూర్ గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సజీయోద్దీన్ ఉన్నారు.

వేద వ్యాప్తికి కృషి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆర్య సమాజం వేదాలు, ఉపనిషత్తుల పరిరక్షణకు ఉద్యమస్ఫూర్తితో నడుస్తోందని, వేద అధ్యయనం, వేద వ్యాప్తి కోసం వారు చేస్తున్న కృషి అమోఘమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఈజ్‌గాం బెంగాలీ క్యాంపులో గల వేద మందిర్ 32వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ముందుగా ఆచార్య శ్రీవాగీష్ ఆశీర్వాదం తీసుకున్నారు.



ఛత్రపతి శివాజీ సేవలు అనిర్వచనీయమైనవి

- ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరామ్
- జిల్లా కేంద్రంలో ఘనంగా జయంతి వేడుకలు



ఆసిఫాబాద్ : శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆరె సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఛత్రపతి శివాజీ సేవలు అనిర్వచనీయమైనవని ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరామ్ అన్నారు. బుధవారం శివాజీ మహరాజ్ జయంతిను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ భవన్‌లో అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరే సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ తమ కులాన్ని ఓబీసీలో చేర్చాలని కోరారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఆరే సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని, ప్రస్తుత భవనానికి అవసరమైన అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఏడాదిలో నిర్వహించే ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చామని ఆయన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఏడాదిలో జరిగే వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో మహనీయుని జయంతి రోజున సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలే బిక్కజి, డివిజన్ అధ్యక్షుడు బోర్కుటే తిరుపతి, మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష, ప్రధాన కార్యదర్శి నాగపూరి మారుతి, సహాయ కార్యదర్శి కురాట్కార్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

కెరమెరి : మరాఠ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సెడ్మకి తుకారాం, గిత్తె గణేశ్, పెందోర్ శ్రీనివాస్, వాడై సుభాష్, కోట్రాంగే శ్రీనివాస్, ఉమేష్ మండలి, పూరీ నరేష్, అదే మున్నా, రామిల్లా మహేష్, కైలాష్, యువకులు పాల్గొన్నారు.

కౌటాల : ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 జయంతి వేడుకలను బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో మండల అధ్యక్షుడు ధనుర్కార్ వసంత్ రావు జెండా ఆవిష్కరించారు. ఆయా గ్రామాలలో గ్రామ అధ్యక్షులు శివాజీ జెండా ఆవిష్కరించి సేవలను కొనియాడారు.

వాంకిడి : మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో ఛత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకలను ఆరె సంఘం నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరె సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని నాయకులు జయరాం, గణేష్, బాపురావు, సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అంతకుముందు హనుమాన్ ఆలయం నుండి ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ వరకు భాజాభజంత్రీలతో ర్యాలీ నిర్వహించి హనుమాన్ ఆలయర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నారాయణ, మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, బౌద్ధమహాసభ అధ్యక్షుడు అశోక్, నాయకులు అశోక్, జయరాం, విజయ్, విలాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఛత్రపతి శివాజీ 395వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే బాక్సులతో ర్యాలీ నిర్వహించి ఛత్రపతి శివాజీ విగ్రహానికి పాలాభిషేకం ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిర్పూర్ తాలూకా ఆరె సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్రి సత్యనారాయణ, ఆరె సంఘం నాయకులు డోకే మహేష్, కుకుడ రాజేష్, రాజన్న, అంకులు, సత్యనారాయణ, చౌదరి తిరుపతి, జునుగరి మధూకర్ పాల్గొన్నారు.



వాంకిడి : బుద్ధవిహార్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కెరమెరి : శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వాంకిడి : ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

సొంతింటి కలను నెరవేర్చాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కార్మికుల చిరకాల కోరిక అయిన సొంతింటి కలను నిజం చేయాలని సింగరేణి కాలరీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అధ్యక్షతన కొత్తగా డైరెక్టర్(ఆపరేషన్)గా ఎన్నికైన సూర్యనారాయణను గోదావరిఖని గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కార్మికుల సొంతింటి కలను నిజం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆర్గనైజర్ సెక్రటరీ వెంగల శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు పెరుక సదానందం, గోదావరిఖని నాయకులు ఆరెపల్లి రాజమౌళి, నరహరిరావు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో నెలకొన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బదిలీపై వచ్చిన జనరల్ మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పెండింగ్ సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ నందు వేసవికాలం దృశ్య రక్షణ చర్యలను, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కిష్టాపూర్ గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. డైనింగ్ హాల్‌కు వెళ్లి, విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే రోగులకు డాక్టర్లు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక చక సమాధానాలు చెప్పారు. దీంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. మండల ఎంఈఓ విజయ్ కుమార్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి, వైద్యురాలు ఉమాశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల ఫేర్వెల్ డే వేడుకలు



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఫేర్వెల్ డేతో పాటు క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఐఈఓ అంజయ్య ప్రత్యేక అతిథులుగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులు సెల్ ఫోన్ తక్కువ వాడాలని, సమయం వృథా చేయకుండా ఒక ప్రణాళిక ప్రకారం 13 రోజులు మంచిగా చదువుకొని అన్ని పరీక్షల్లో పాస్ అవ్వాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల కృత్యాలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, మందమర్రి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి ప్రిన్సిపాల్ అంజయ్య, లక్షెటపేట ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, జీజేఎల్ఏ అధ్యక్షుడు విజిత్ కుమార్, కళాశాల సిబ్బంది రమేష్, రాజేశ్వరి, పీడీ బాబు రావు పాల్గొన్నారు.

జాలర్ల వలకు చిక్కిన అరుదైన చేప

నవతెలంగాణ-హాజీపూర్



ఎల్లంపల్లి ప్రాజెక్టులో జాలర్ల వలకు అరుదైన చేప చిక్కింది. గుడిపేట్ గ్రామానికి చెందిన జాలర్లు బుధవారం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి చేపల వేటకు వెళ్లారు. ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో కట్టిన వలకు అరుదైన చేప చిక్కింది. దీంతో చేపల కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు ఆసక్తిగా చూస్తూ, వారి సెల్ ఫోన్‌లలో ఫోటోలు తీశారు. జాలర్లు మాట్లాడుతూ ఇలాంటి చేపను ఎల్లంపల్లిలో ఎప్పుడు చూడలేదని దీనిని శీకు మొట్ట అంటారని తెలిపారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-మందమర్రి

ముదిరాజుల కుల ఆరాధ్య దైవమైన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ కులస్తులు బుధవారం భూమి పూజ చేశారు. సీఈఆర్ క్లబ్ పక్కన ఆలయం నిర్మిస్తున్నట్టు తెలిపారు. ముదిరాజ్ కుల సభ్యులు నెల్లి రాజలింగు, ఆలయ కమిటీ చైర్మన్ గరిగే సుమన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, మంచిర్యాల జిల్లా యూత్ ప్రెసిడెంట్, సంకేపల్లి ప్రభాకర్ గౌరవ అధ్యక్షులు, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, కట్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి, ముఖ్య సలహాదారులు పిల్లి మల్లయ్య అంకం కొమురయ్య పాల్గొన్నారు.

వారసంత.. ట్రాఫిక్ చింత..!

- సతమతమవుతున్న ప్రయాణికులు
- సదుపాయాలు లేక రోడ్డుపైనే క్రయ విక్రయాలు
- గతంలో భారీ వాహనం దూసుకెళ్లి ముగ్గురు బలి
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు



ప్రతి గురువారం నిర్వహించే వారసంతతో రద్దీగా మారిన ప్రధాన రహదారి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీలోని 63వ జాతీయ రహదారిపై ప్రతి గురువారం, ఊత్కూర్ చౌరస్తా వద్ద వార సంతతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుకు ఇరు వైపుల చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నిలబడి వినియోగదారులతో చిరువ్యాపారులు బేరసారాలు సాగించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఎప్పుడు ప్రమాదం జరుగతుందోనని స్థానికులు బయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో సమస్య జటిలమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఊత్కూర్ చౌరస్తా వద్ద ఓ టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెల్లగా రోడ్డు పక్కన నిలుచున్న ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారు. ఎప్పుడు రద్దీగా ఉండే చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై వారసంత నిర్వహించడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. లక్షెట్టిపేట నుంచి మంచిర్యాలకు వెళ్లే జాతీయ రహదారి గుండా ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి గురువారం నిర్వహించే వార సంతతో ఇబ్బందులు తీవ్రవమతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్య లేని ప్రదేశాన్ని గుర్తించి వార సంతను అక్కడికి తరళించాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి రూ.2.50 లక్షల ఆదాయం

గత నాలుగు సంవత్సరాలుగా రోడ్డుపైనే వారసంత నిర్వహిస్తుండటంతో లక్షెట్టిపేట మున్సిపాలిటీకి వేళంపాట ద్వారా రూ.2.50 ఆదాయం సమకూరుతోంది. గత ఏడాది ఎప్రిల్ 1వ తేది నుంచి వేలం దక్కించుకున్న సదరు కాంట్రాక్టరు ప్రతీ వారం సంతలో విక్రయించుకునేందుకు చిరు వ్యాపారుల వద్ద రూ.10, 20, 50 వసూలు చేస్తున్నారు. రోడ్డుపైన విక్రయించేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి వద్ద వసూలు వసూలు చేస్తున్నపటికీ తమకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతో రైతులకు మినహాయింపు

గత ఎన్నికల్లో తనను గెలిపిస్తే వార సంతంలో రైతులకు ఎలాంటి రుసుము చెల్లించే అవసరం లేదని, తానే ఆరుసుము పరిస్తానని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హామీ ఇచ్చారు. దానికి కట్టు బడి ఉన్న ఎమ్మెల్యే గత ఆరు నెలలుగా చిరు వ్యాపారుల వద్ద ఎలాంటి రుసుము వాసూలు చేయనివ్వడం లేదు. మారుమూల గ్రామాల నుంచి వచ్చి చిరు దాన్యాలు, కూరగాయలు విక్రయించే వారికి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పూర్తిగా మినహాయించినట్టు మున్సిపల్ అధికారులు పేర్కొటుంన్నారు. ఇదిలా ఉండగా ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని, మున్సిపల్ అధికారుల వార సంత కోసం స్థలం గుర్తించాలని పవురు కోరుతన్నారు.

ప్రాణహాని జరిగే అవకాశం ఉంది

దర్శనాల నవీన్ కుమార్, ఊత్కూర్ నివాసి, లక్షెటిపేట.



వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై వారసంత ఏర్పాటు చేయడంతో ప్రాణహాని జరిగే అవకాశాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఈ వారసంతను మార్కెట్ యార్డ్‌కు తరలించాలని కోరుతున్నాను.

ఎన్నోసార్లు వినతిపత్రం ఇచ్చిన లాభం లేదు

ఎ సతీష్ కుమార్, ఉత్కూర్ నివాసి, లక్షెట్టిపేట.



వారసంతా ప్రధాన రహదారిపై నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ సమస్యపై ఎన్నోసార్లు వినతిపత్రం ఇచ్చిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఇకనైనా పరిష్కరించాలని కోరుతున్నాం.

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, లక్షెట్టిపేట.



వారసంత ప్రధాన రహదారిపై నిర్వహించడం సమస్యతో కూడుకున్నదే. గతంలో ఎన్నో ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్న నేను కొత్తగా బాధ్యతలు తీసుకోవడంతో నా దృష్టికి వచ్చిన ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాను.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు వంద శాతం నమోదు కావాలి

- పీఆర్‌సీటీ సభ్యులు డాక్టర్ రమణ, శ్రీనివాస్



ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పీఆర్‌సీటీ సభ్యులు

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఆస్పత్రిలోనే వంద శాతం ప్రసవాలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని జాతీయ ఆరోగ్య మిషన్ పీఆర్‌సీటీ సభ్యులు డాక్టర్ రమణ, శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని, ఇందన్‌పల్లి గ్రామంలో ఉన్న ఉప కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జన్నారంలో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు గురించి వివరించారు. అంటు వ్యాధులు అదుపులకు తీసుకుంటున్న చర్యలు సిబ్బంది, వివిధ వివరాలను నమోదు చేయడం రిజిస్టర్లను సక్రమముగా నిర్వర్తించడం వైద్యులు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించడం రోగులకు ఆయుష్మాన్ భవ ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందుబాటులో తేవడం డిజిటల్ మిషన్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వివరాలను సేకరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. టీకాలు గర్భవతుల నమోదు చేయడం సాధారణ ప్రసవాలకు ప్రాముఖ్యత ఇవ్వడం కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై వివరాల అడిగి తెలుసుకున్నారు. జాతీయ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా లాంటివి ప్రబలకుండా తీసుకొనవలసిన చర్యలు, వాటికి సంబంధించిన పరీక్షలు అందుబాటులో ఉన్న వీలేనివి తెలుసుకున్నారు. అదేవిధంగా క్షయ నివారణ కుష్టు నివారణ కార్యక్రమాలు 108 అంబులెన్స్ అత్యవసర సర్వీసులు అమ్మ ఒడి ద్వారా 102 సర్వీసులు 22 రకాల రిజిస్టర్‌లను ఇండికేటర్లను చూడడం జరిగినదన్నారు. వారి వెంట సుధాకర్ నాయక్, ఉపజిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ, ప్రశాంతి డీపీఓ వెంకటేశ్వర్లు సీహెచ్ఓ బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

లంబాడీల గుడిసెలను కూల్చివేయడం సరికాదు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవునిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల గడ్డంగూడలో తర తరతరాలుగా నివాసం ఉంటూ అక్కడే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న లంబాడా గిరిజనుల గుడిసెలను కూల్చివేయడం దారుణమని లంబాడ హక్కుల జాగృతి సమితి నాయకులు అన్నారు. మంగళవారం తెల్లవారుజామున అటవీ అధికారులు సుమారు 2గంటల ప్రాంతంలో ఒక్కసారిగా దాడి చేసి నిద్రిస్తున్న సమయంలో జేసీబీలు, ట్రాక్టర్‌లు పెట్టి చిన్న పిల్లలు ముసలి వాళ్ళు, మహిళలు అని చూడకుండా విధ్వంసం సృష్టించి ఇండ్లను కులగొట్టినారన్నారు. బుధవారం మండల లంబాడి హక్కుల జాగృతి సమితి, సేవాలాల్ ఉత్సవ కమిటీ వివిధ అనుబంధ సంఘాలు కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి సానుభూతి ప్రకటించారు. అటవీ అధికారుల చేసిన చర్యను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. గత 25 సవంత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటు పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల చర్యలను మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, భీంలాల్, రాజన్న, నందు నాయక్. భరత్ నాయక్, రాజు నాయక్, శ్రీరామ్ నాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కొత్త సుజాత, సింగతి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుకూరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా అక్కల రాజమణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గోపతి రాజేష్, కోశాధికారిగా పోలంపెల్లి సురేష్, ఉపాధ్యక్షుడిగా గోపతి సురేందర్, సామాంతుల మాధవి, జాయింట్ సెక్రటరీగా బోడ రాజశేఖర్, మల్యాల సునీత, పబ్లిసిటీ సెక్రటరీగా పోతు శృతి, ఆర్గనైసింగ్ సెక్రటరీగా మోటాపలుకుల రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా శేర్ల వేనతి, చిట్టెం శ్రీలత, ఇండ్ల లావణ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌గా కన్వర్ట్ చేయాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.50 లక్షల పరిహారం ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రతి కార్యదర్శికి ఆరోగ్య భద్రత కార్డుతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, నిర్దిష్ట పనివేళతో పాటు జాబ్ చార్ట్ జీఓ వెంటనే విడుదల చేయాలని తీర్మానించామని తెలిపారు.

ఇష్టంతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-దండేపల్లి

పదో తరగతి విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బుధవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.. విద్యార్థులు పరీక్షలు అంటే భయం విడాలని తాము చదువుకున్న ప్రశ్నలు మాత్రమే పరీక్షలో వస్తాయని భయాందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఆంగ్ల మాధ్యమానికి సంబంధించిన అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు విద్యార్థులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా సందేహాలు ఉంటే తమ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని వారు కులంకుశంగా వివరిస్తారని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చిన్నయ్య, ఉపాధ్యాయులు, సీఆర్పీ నరసయ్య పాల్గొన్నారు.

ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నవతెలంగాణ-తాండూర్

నెహ్రూ యువ కేంద్ర ఆదిలాబాద్ వారు మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ సహకారంతో బెల్లంపల్లి ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్లస్టర్ ఆఫ్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ బెల్లంపల్లి-మందమర్రి బ్లాక్‌లోని జిల్లా లోనీ వివిధ గ్రామాల యువతి యువకులు పాల్గొన్నారు. యువతులకు షటిల్, రన్నింగ్, కబడ్డీ వాలీబాల్ పోటీలను నిర్వహించి ప్రథమ ద్వితీయ బహుమతులకు ఎంపిక చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందనీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కంపల్లి శంకర్, ప్రగతి యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు మాధురి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్, అధ్యాపకులు గజెల్లి మోహన్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి రఫీక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వేలాల జాతర ఏర్పాట్లు

- వసతుల కల్పనపై అధికారుల ప్రత్యేక దృష్టి
- భక్తులకు ఇబ్బంది కలుగకుండా పంచాయతీ, దేవాదాయ అధికారుల చర్యలు



గట్టుమల్లన్న ఏరియాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్


వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు కల్పించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. గోదావరి నది ఏరియాతో పాటు గట్టుమల్లన్న గుట్ట భక్తుల ఏర్పాట్ల విషయంలో పోలీస్ అధికారులు ప్రత్యేక దష్టి సారించారు. ప్రధానంగా వసతుల కల్పనపై ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను సమన్వయం చేస్తుండగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు ఇటీవల సమీక్షించారు. పార్కింగ్ ఏరియా, వాహణాల రాకపోకలు, గోదావరి నది ఏరియాలో స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయించడంపై ఏసీపీ సూచనల మేరకు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ శ్రీధర్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

వేలాల జాతరకు 3 నుండి 4 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు వసతులు కల్పించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్టీపీపీ యాజమాన్యం సమకూర్చనున్న సోలార్ లైటింగ్‌తో పాటు మరో 30 విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ లైటింగ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ కారణంగా పారిశుధ్య పనులను గుట్టపై దేవాదాయ శాఖ చేపట్టాలని, గుట్ట కింద జాతర ఏరియాలో గ్రామ పంచాయతీ బాధ్యతలు నిర్వర్తించాలని నిర్ణయించారు. గోదావరి ఏరియాలో కూడా గ్రామ పంచాయతీ బాధ్యతగా ఎప్పటికప్పుడు పారిశుధ్యపు పనులు చేపట్టాల్సి వుంటుంది. అదేవిధంగా తాగు నీటి సరఫరా విషయంలో కూడా గుట్ట ఏరియాలో దేవాదాయశాఖ, వేలాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తగు నీటి ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. గోదావరి నది వద్ద బట్టలు మార్చుకునే గదులు, మూత్రశాలలు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు పర్యవేక్షణ మొత్తం పోలీస్ శాఖ పరిధిలో కొనసాగనుంది. అదే విధంగా అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని షిఫ్టుల వారిగా మెడికల్ క్యాంపుల నిర్వహించుటకు ఇప్పటికే సంబంధిత శాఖను కలెక్టర్ ఆదేశించారు. క్యూలైన్లలతో పాటు ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు ఏర్పాటు చేస్తుండగా ఎస్టీపీపీ యాజమాన్యం తాగు నీటి నిల్వల కోసం 20 సింటెక్స్ వాటర్ ట్యాంకులు, అత్యవసర పనుల కోసం జేసీబీ, సోలార్ విద్యుత్ లైట్ల ఏర్పాటుకు ముందుకొచ్చింది. జాతర ఏరియాలో 3 అగ్నిమాపక వాహణాలు, గోదావరి నది వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు

భక్తులకు అందుబాటులో ఆర్టీసీ బస్సు సర్వీసులు

వేలాల జాతరకు తరలివచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో తిప్పనున్నారు. జాతరకు 3 రోజుల పాటు మంథని, మంచిర్యాల, గోదావరిఖని డిపోలకు చెందిన బస్సులు వివిధ ప్రాంతాల మీదుగా నడుపనున్నట్లు అధికారుల తెలిపారు. మంచిర్యాల డిపోకు చెందిన బస్సులు 60 మంథని డిపోకు చెందిన బస్సులు 40, గోదావరి ఖని డిపోకు చెందిన 56 బస్సులు భక్తుల రాకపోకలకు ప్రత్యేకంగా కేటాయించారు.



ఫిల్టర్ బోరు నీటి లభ్యత పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఆర్డీఓ

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నర్సాపూర్-జి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌ను ఆర్డీఓ రత్న కల్యాణి పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి నూతనంగా విధులలో చేరిన ఉద్యోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆమెతో పాటు తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు

నవతెలంగాణ-నిర్మల్



అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. అంగన్‌వాడీల అభివృద్ధి, ఉన్నతీకరణ, ఇతర అంశాలపై సంక్షేమ శాఖ జేడీ బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఆయన పాల్గొని జిల్లాలోని పరిస్థితులను తెలియజేశారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీలను తనిఖీ చేస్తున్నామని, అవసరమైన ప్రతి అంగన్‌వాడి కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు వీసీలో తెలిపారు. ఇందులో సీడీపీఓ నాగలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తికి రిమాండ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

భార్యను కత్తితో హత్య చేసేందుకు యత్నించిన గుట్టే అంకుష్(35)ను బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. అడ్డు పడ్డ అత్తమ్మ కేంద్రే అనిత, రాధాబాయికి సైతం గాయాలయ్యాయని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుప్టి గ్రామం సమీపంలో కడెం వాగులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వాగులో మృతదేహాన్ని చూసి స్థానికులు భయాందోళనతో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు.

మరోసారి దరఖాస్తు అవసరం లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా పాలన, గ్రామ సభలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్ళీ మీసేవలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని డీఎస్ఓ వాజిద్ ఆలీ బుధవారం ఒక ప్రకటలో స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్నవారి జాబితా మండల తహసీల్దార్ల నుండి సేకరించమన్నారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయని వారు కొత్త రేషన్ కార్డ్ కోసం కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుటకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ అకాడమి ఫర్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో యువతకు ఇస్తున్న నైపుణ్య అభివృద్ధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీసీపీఓ బూర్ల మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌లో 70 మంది నిరుద్యోగ యువతకు ఇస్తున్న 45 రోజుల శిక్షణ కార్యక్రమంలో ఒక దశ పూర్తి చేసుకుని అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత విద్యార్థులు నిర్దేశించిన లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. టాస్క్ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకొని ఉద్యోగం సాధించాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ రీజినల్ మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

భక్తుల కోసం మొరం రోడ్డు




నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులోని వర్ధా నది మధ్య భాగంలో ఉన్న శ్రీ శివ సిద్ధి హనుమాన్ దేవాలయం మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మొరం రోడ్డు వేశారు. దైవ దర్శనం, గంగా స్నానం కోసం రెండు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలలో వచ్చే భక్తులకు రవాణ సౌకర్యం నిమిత్తం వస్తుంటారు. తాటిపల్లి గ్రామం నది ఒడ్డు నుంచి వార్ధా నది మధ్య భాగంలో ఉన్న శివాలయం వరకు మొరం రోడ్డు నిర్మాణం పనుల ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు దేవాలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎల్ములే దత్తు, ఉపాధ్యక్షులు మండ్రే ప్రవీణ్, కార్యదర్శులు ధనరాజ్, ప్రవీణ్, కమిటీ సభ్యులు దివాకర్ పటేల్, మాజీ ఉప సర్పంచ్ గోండే నితేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఏ విధంగా తీసుకువెళ్లాలనే అంశంపై చర్చ జరిగినట్లు ఆమె తెలిపారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరపున మసీదులు, ఈద్గా వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమండ్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు మైనార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి అజర్ హుస్సేన్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు చిన్ను, నిర్మల్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మతిన్, ఇమ్రాన్ ఉల్లాహ్, ముజేహిద్ బిన్ మొహమ్మద్, అన్వార్ పాషా, సలీం, సైద్ అర్షద్, అల్తాఫ్ కిజార్, జీషన్ అలీ, అహటేషం, నవీద్, సర్దార్ పాల్గొన్నారు.



జిల్లాలో ఉషా క్రీడల అభివృద్ధికి కృషి

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ



పోటీలను ప్రారంభిస్తున్న ఉషా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఉషా క్రీడలను మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తామని ఉషా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ అన్నారు. బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉషా రాష్ట్ర క్రీడాపోటీలను నిర్వహించారు. దానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఉషా విభాగంలో స్పోర్ట్స్ కింద పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి ఎస్ఎస్ఈలో శిక్షణ తీసుకుంటున్న రాథోడ్ స్వాతిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఉషా క్రీడలను మరింత ప్రోత్సహించి క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగేల కృషి చేస్తామన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు. ప్రభుత్వాలు కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కేటాయించాయని తెలిపారు. క్రీడాకారులు నిత్యం సాధనలు చేస్తు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. తమ అసోసియేషన్ తరపున శిక్షణ అందించడంతో పాటు ఆయా పోటీల్లో పాల్గొనేలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో నిర్వహించేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్, పెటా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సాయి, ఉషా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గణేష్, వేముల సతీష్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మెన్ అన్నరావు వీరేష్, మాధవి, వనిత, వివి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



విన్యాసాలు చేస్తున్న క్రీడాకారులు

బ్యాంకులు మెరుగైన సేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు వివిధ రుణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు అందించే రుణాల మంజూరులో ఆలస్యం చేయొద్దని తెలిపారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఇప్పటివరకు ప్రజలకు బ్యాంకుల ద్వారా అందించిన రుణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పొటెన్షియల్ లింకుడ్ క్రెడిట్ ప్లాన్ 2025-26 సంచికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీఓ విజయలక్ష్మి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రామారావు, ఆర్‌బీఐ ఎల్‌పీఓ దేవ్‌జిత్ బారువ, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా క్రెడిట్ ప్లాన్ సంచికను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్, బ్యాంకర్లు, అధికారులు

వేసవిలో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య



కలెక్టర్లతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం జిల్లాలో పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రానున్న వేసవిలో జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు, కరెంట్ కోతలకు సంబంధించి గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని ఆవాసాల్లో అన్ని చర్యలూ తీసుకోవాలని అన్నారు. బోరు బావుల ఫ్లషింగ్, ఇతర నిర్వహణ పనులు ముందుగానే చేపట్టాలన్నారు. వేసవి ప్రభావం ఇప్పటి నుండే ప్రారంభమైందని, మే, జూన్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి అంశాల కారణంగా నీటి ఎద్దడి ఎక్కువ ఉండే అవకాశముందని, అందుకని పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే మున్సిపల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య, కరెంట్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని సూచించారు.

సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ స్థల పరిశీలన

నిర్మల్ : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్ మీడియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య బుధవారం దిలావార్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన సముదాయానికి కేటాయించిన సర్వే నెంబరు 664లో గల 17 ఎకరాల 9 గుంటల భూమిని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ, ఇతర అంశాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భవన నిర్మాణాలను అన్ని హంగులతో నిర్మిస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్‌అండ్‌బి ఈఈ అశోక్ కుమార్, డిఐఈఓ పరశురాం, డిఈ గంగాధర్, తాహసీల్దార్ స్వాతి, ఏఈ తుకారాం పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి ఘనస్వాగతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్పోర్ట్స్ కోటా ఉద్యోగం సాధించి భారత జట్టుకు ఖోఖోలో ప్రాతినిధ్యం వహించి కప్ గెలవడం గర్వకారణమని పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్ధార్థ అన్నారు. ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో సాయిపోతిరెడ్డి శివారెడ్డి ఖోఖోలో ప్రపంచ కప్‌లో పాల్గొని విజయం సాధించి తిరిగి ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం వినాయక్ చౌక్‌లో తపాల ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బ్యాండ్ మేళాల మధ్య జాతీయ జెండాలను చేత పట్టుకొని కార్యాలయం వరకు స్వాగతించారు. అనంతరం ఆయనను ఎస్పీ సత్కరించి మెడల్స్ అందించారు. అదే విధంగా జూడో విభాగంలో ఇంటర్నేషనల్ క్రీడాకారిణి మలప్రభ కూడా ప్రతిభచాటారని గుర్తు చేస్తూ అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల శాఖ ఉద్యోగి అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం శాఖతో పాటు జిల్లాకు గర్వకరణమన్నారు. క్రీడాకారులను తమ శాఖ ప్రోత్సహిస్తుందన్నారు. శివారెడ్డి ఖోఖో విభాగంలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించారని తెలిపారు. ఆయన అనేక పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారని గుర్తు చేశారు. క్రీడాకారుడు శివారెడ్డి మాట్లాడుతూ తాను వరల్డ్ కప్‌లో రాణించడానికి శాఖ అధికారుల సహకారం ఎంతో ఉందన్నారు. కష్టపడినా ప్రోత్సహం లేకపోతే లక్ష్యాన్ని సాధించలేమన్నారు. తనకు శాఖ ఉద్యోగులు ఎంతో ప్రోత్సహం అందించారని తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ గంగాధర్, సిబ్బంది ఉత్తం కుమార్, రాజేష్ పాల్గొన్నారు.



క్రీడాకారుడికి మెడల్స్ అందిస్తున్న పోస్టల్ ఎస్పీ

ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ

హిందూ వాహిని, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శివాజీ చేసిన సేవలను కొనియాడారు. ఇందులో సంతోష్, సాయి కిరణ్, నారాయణ. మాజీ సర్పంచ్ జాదవ్ మహేందర్, గోవర్ధన్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

బోథ్ : సొనాల మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల యువత, ప్రజలు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ గడువు పెంపు

నవతెలంగాణ-నిర్మల్

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి చేపట్టిన నియామకాల దరఖాస్తులపై అభ్యంతరాల స్వీకరణ గడువు ఈనెల 24 వరకు పెంచినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య కళాశాలలో పొరుగు సేవల పద్ధతిన 32 ఖాళీల భర్తీ నియామక ప్రక్రియలో భాగంగా అర్హులైన అభ్యర్థులపై అభ్యంతరాల స్వీకరణ గడువు ఈనెల 20 నుంచి 24 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఖాళీల భర్తీ ప్రక్రియకు డాక్టర్ అంకిత్ రాజ్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాల స్వీకరణపై ఎటువంటి సందేహాలున్న నోడల్ అధికారి మొబైల్ నెంబరు 9494392355 సంప్రదించవచ్చునన్నారు. అర్హులపై ఎటువంటి అభ్యంతరాలున్న నిర్మల్ అధికారిక, వైద్య కళాశాల అధికారిక వెబ్ సైట్‌లో పొందుపరిచిన గూగుల్ ఫారంను నింపి తమ అభ్యంతరాలను తెలుపవచ్చునని తెలిపారు.

హైవేపై పచ్చ పూలందం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రం గుండా వెళ్తున్న నేషనల్ హైవేపై డివైడర్ మధ్యలో అధికారులు పచ్చని పూల చెట్లు పెట్టడంతో ఒకేసారి పోసి అందంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆకురాలి చెట్లు మోడువారే కాలమైన హైవేపై పసుపుపచ్చ పూలతో ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. హైవే అధికారులు చెట్లకు ప్రతిరోజు నీళ్ల పోయడంతో పూలు పూసి అందంగా కనిపిస్తున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్‌కు విజయాన్ని అందించాలని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు. ప్రజాసేవా భవన్‌లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, బూర్ల శంకరయ్య, సాయబ్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నుండి రామాగౌడ్, విఠల్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, సాగర్ గౌడ్, వేణుగోపాల్, ఎల్లయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే రాహుల్ ఆధ్వర్యంలో మహాలక్ష్మవాడ నుండి బీఆర్ఎస్‌కు చెందిన చంద్రకాంత్, అడ్వకేట్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో న్యాయవాది జాదవ్ రవికిరణ్ హస్తం తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కష్టపడి పనిచేసినవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందని, స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆవుల వెంకన్న, నాయకులు కొండూరి రవి, మానే శంకర్, ఎంఏ కయ్యుమ్, అశోక్, రాహుల్ జమ్ముడే, వసంత్, అడ్వకేట్ భావన సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-నార్నూర్

శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని తడిహత్నూర్ గ్రామంలో గ్రామ యూత్ సభ్యులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. కాగా శిబిరంలో 70 మంది యువకులు రక్తదానం చేశారు. సీఐ రహీమ్ పాషా రక్తదానం చేయడం ఆనందకరమని జిల్లా సార్మేడి దుర్గు పటేల్ అన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ డీఎంహెచ్ఓ మనోహర్, నాయకులు శేఖర్ బాబు, తొడసం నాగోరావ్, మెస్రం శేఖర్ బాబు, గ్రామ మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్, మాజీ ఉప సర్పంచ్ విష్ణు, విద్యారాణి, యూత్ సభ్యులు రవీందర్, జాదవ్ యువరాజ్, జితేందర్, గణేష్, శుభం, విజయ్, బాలకృష్ణ, ప్రవీణ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కేశవనాథాలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండు రోజుల పాటు నిర్వహించిన కేశవనాతాలయ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు బ్రాహ్మణవాడ ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా 132కేవీ లైన్ నిర్మణానికి గాను గురువారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 33కేవీ బెజ్జూర్ ఫీడర్ 11కేవీ చీపురుదుబ్బ ఫీడర్ ఎల్‌సీ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రెబ్బెన, బెజ్జూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గురుడ్ పేట్, కన్నేపల్లి, కనికి, బోదంపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

22న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యం పాఠశాలలో ఈనెల 22న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రామారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఆహ్వాన పత్రికను అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల బలోపేతంపై సమావేశంలో చర్చించాలన్నారు.

నవతెలంగాణ

అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కిష్టాపూర్, వేలాల శివారు గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను జైపూర్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం కిష్టాపూర్ శివారు గోదావరి నది వద్ద 2, వేలాల శివారు గోదావరి నది వద్ద 2 ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

- అదనపు కలెక్టర్ మోతిలాల్

నవతెలంగాణ-తాండూర్

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని సింగరేణి కళావేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయడం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగుల సౌకర్యార్థం సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. బెల్లంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బెల్లంపల్లి, భీమిని, కాసిపేట, కన్నెపల్లి, తాండుర్, నెన్నెల, మందమర్రి రూరల్, అర్బన్ మండలాలకు సంబంధించిన 300 మందిదివ్యాంగులు పాల్గొన్నారు. వీరందరికి అలిమెకో వారి సహకారంతో పరీక్షలు నిర్వహించారు. ఇందులో గుర్తించినటు వంటి దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందజేస్తామని సీడీపీఓ స్వరూప రాణి తెలిపారు. చరవాణి ద్వారా సమాచారం అందించి ఉపకారణాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ రహుఫ్‌ఖాన్, బెల్లంపల్లి హరికృష్ణ, డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలు, ఎంఈఓలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి పట్టం కట్టండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 27వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పట్టభద్రులతోపాటు ఉపాధ్యాయులు కషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రంగాల్లో విఫలమైన అధికార కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలిపిన నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి అభ్యర్థులైన మల్కా కొమురయ్య అంజి రెడ్డి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సలేంద్ర శివయ్య, సీనియర్ నాయకులు గందే విజయ్ కుమార్, అల్లూరు నారాయణరెడ్డి, రైతు విభాగం నాయకులు చింతలపల్లి, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత

తలమడుగు : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జాతర సందర్భంగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. బుధవారం చివరి రోజు శ్రీ వెంకటేశ్వర కళ్యాణ ఉత్సవంతో పాటు క్రికెట్ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి మండల కేంద్రానికి చెందిన పిడుగు సంజీవరెడ్డి రూ.40 వేలు ఎన్.వినీత్ 11 క్రికెట్ టీం అందజేయగా, రెండవ బహుమతి రూ.30 వేల కాటిపల్లి హరీష్ రెడ్డి, కోసాయి, మూడవ బహుమతి ఐటీ సొల్యూషన్ హాకింగ్ రూ.20 వేల జవహర్లా, నాలుగవ బహుమతి రూ.10 వేలు బడగరి తిరుపతి, బజార్‌హత్నూర్ క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అభిరామిరెడ్డి, రవికాంత్ యాదవ్, నడిమల వినిల్ రావు, శ్రీనివాసరెడ్డి, పద్మాకర్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం చత్రపతి శివాజీ

నవతెలంగాణ-హాజీపూర్

చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా చత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో హాజీపూర్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు చత్రపతి శివాజీ ఆదర్శ మూర్తి అని, ధైర్యానికి శౌర్యానికి వీరత్వానికి చత్రపతి శివాజీ ప్రతీక అని అన్నారు. హిందూ సామ్రాజ్య స్థాపనకు ఆనాడు మొగలాయులపై యుద్ధం చేసి అంతమొదించిన వీరుడని యువత ఆదర్శంగా తీసుకుంటుందని, మనమంతా హిందూ ధర్మ రక్షణకై సైనికులుగా తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ సేవా సమితి సభ్యులు గడ్డం స్వామిరెడ్డి, మోట పలుకుల తిరుపతి, మాధవరపు, వెంకటరమణరావు, బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, బేతు రవి, బియ్యాల సతీష్‌రావు, మడిపల్లి సత్యనారాయణ, రాయలి మల్లేష్, కొట్టే ప్రశాంత్, జూపాక ధర్మయ్య, మారు వెంకట్‌రెడ్డి, యాదగిరి సురేష్, ఐలవేణి సతీష్ పాల్గొన్నారు.



తాండూర్‌లో చత్రపతి శివాజీ శోభాయాత్ర



హాజీపూర్‌లో..

ఘనంగా చత్రపతి శివాజీ శోభాయాత్ర

తాండూర్ : మండల కేంద్రంలో బుధవారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి పురస్కరించుకొని శోభయాత్ర నిర్వహించారు. కిష్టంపేట బస్టాండ్ సమీపంలోని హనుమాన్ మందిరం నుంచి శివాజీ చిత్రపటాన్ని ఊరేగింపుగా ఐబీ మీదుగ కొనసాగింది. డీజే చప్పులతో యువకుల సాంప్రదాయ నృత్యాలతో కన్నుల పండుగగా సాగింది. ఛత్రపతి ఉత్సవ కమిటీ సభ్యులు దుగ్యాల ప్రదీప్‌రావు, విష్ణు కళ్యాణ్, సంతోష్, ఏమూర్ల ప్రవీణ్, మద్దికుంట అనుదీప్, తాళ్లపల్లి అభ్జిత్ గౌడ్, ర్యాలీలో పాల్గొన్నారు. అచ్చులాపూర్ గ్రామంలో గట్టు సంతోష్ కుమార్, చోధన్, రాజయ్య, మహాదేవ్, ప్రవీణ్, సతీష్, శ్రావణ్, గోపాల్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి సంబరాలను జరుపుకున్నారు. శోభాయాత్ర సందర్భంగాఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి ఎస్ఐ కిరణ్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తును నిర్వహించారు.

జన్నారం : భరతమాత ముద్దుబిడ్డ ధైర్యానికి దేశ భక్తికి ధీరత్వానికీ దైవభక్తికి మారుపేరు చత్రపతి శివాజీ అని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ కడార్ల నర్సయ్య అన్నారు. బుధవారం చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, మంచిర్యాల డివిజన్ మోకు దెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నర్సాగౌడ్, మండల పూసల సంఘం నాయకుడు గుడ్ల రాజన్న, యువ నాయకులు పర్ల శంకర్, కొండపెల్లి మహెష్, అత్తె రఘు, ఖానాపూర్ నియోజకవర్గ కోకన్వీనర్ ఆంద్ర పురుషోత్తం, భూతం శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిదంగా కలమడుగు క్రగామంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను గ్రామ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా హిందూ ధర్మ జాగృతి జిల్లా అధ్యక్షుడు జంగం సంతోశ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.



శివాజీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్ రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-తలమడుగు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడేగజేందర్ కోరారు. బుధవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగం ఇస్తామని బీజేపీ, ఇంటికి ఓ ఉద్యోగం ఇస్తామని గత బీఆర్ఎస్ మోసం చేశాయన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలో డీఎస్సీ నోటిఫికేషన్ నియమకాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు



బదీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, నాయకులు ప్రతాప్, ప్రవీణ్ రెడ్డి, నారాయణ, సాయి, ఊడుగు రాకేష్, గంగన్న పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

నవతెలంగాణ-కౌటాల

కౌటాలలో మరాఠా సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 జయంతి సందర్భంగా కౌటాల ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ కరపత్రాలను విడుదల చేవారు. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ మార్చి 5న ప్రారంభమయ్యే లీగ్‌లో ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ ఈనెల 25లోపు, ఆక్షన్ ఈనెల 27న ఉంటుందన్నారు. ఫ్రాంచైజీగా ఉండలనుకున్న వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్, నాయకులు డబ్బా బాపు, తిరుపతి, రవీందర్ గౌడ్, ప్రకాష్, అశోక్, గోపాల్, పవిత్ర, ఉమాపతి, సుధాకర్, వాను పటేల్, దామోదర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో దొంగతనం

ముధోల్ : ఆగి ఉన్న బస్సులో ఇద్దరు మహిళలు దొంగతనంకు పాల్పడిన సంఘటన బుధవారం స్థానిక బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సంజీవ్ కథనం ప్రకారం.. మండలంలోని అష్టా గ్రామానికి చెందిన సునీత తన ఇద్దరి పిల్లలతో నిజామాబాద్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో బస్సులో ఎక్కింది. పిల్లలు త్రాగునీరు కావాలనడం వారిని బస్సులో కూర్చోబెట్టి నీటి కోసం వెళ్లించారు. తిరిగి వచ్చి చూసేసరికి ఆమె బ్యాగ్‌లో సెల్‌ఫోన్, రూ. 1000 నగదు కనిపించకపోవడంతో ఈ విషయాన్ని బస్సు డ్రైవర్‌కు తెలిపింది. దీంతో డ్రైవర్ బస్సును స్థానిక పోలీస్ తీసుకెళ్లాడు. పోలీసులు బస్సులోని ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేసి బాసరకు చెందిన ఇద్దరు మహిళ ప్రయాణికుల నుండి సెల్ ఫోన్‌ను, రూ.1000 నగదును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందించారు. చోరికి పాల్పడిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీఎం రవి ప్రసాద్‌కు సన్మానం

నవతెలంగాణ-రెబ్బన

మార్కెటింగ్ జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను బుధవారం ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ నెలలో రిటైర్మెంట్ పురస్కరించుకొని అన్ని ఏరియాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బెల్లంపల్లి ఏరియాను సందర్శించగా బ్రాంచ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సెక్రటరీ ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్యా మొగిలి, అలాగే ఆర్గనైజింగ్ సెక్రటరీలు జగ్గయ్య, జూపాక రాజేష్, సముద్రాల ఆనంద్, కిరణ్‌బాబు, దివాకర్ వర్క్ షాప్ ఫిట్ సెక్రెటరీ అశోక్, నాయకులు దిలీప్, నరేష్, రమేష్, కోటి, వసీం ,అశోక్, శంకర్ పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-సిరికొండ

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై శివరాం అన్నారు. బుధవారం మండలంలోని రిమ్మ గ్రామంలో పోలీసు కళజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం ద్వారా జరిగే ప్రమాదాలు, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ కళాజాతలో ఏఎస్సై రమేష్, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, గ్రామ పటేల్ శంకర్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ నిర్వహణకు నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గత ఆగస్టు నుండి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపు గ్రామ పంచాయతీల నిర్వహణ కొరకు నిధులను విడుదల చేయాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీడీవో ఆల్బర్ట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాకేష్, నరేష్, చంద్రయ్య, చంద్రశేఖర్, జయశ్రీ, కిష్టయ్య పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

వికలాంగుల పెన్షన్ కోసం తప్పుడు ధృవీకరణ పత్రాలు పొందిన వారితో పాటు సర్టిఫికెట్లు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో వందలకుపైగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొంది అక్రమంగా పెన్షన్ పొందుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.